నవతెలంగాణ
సమస్త తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 21, 2025 | www.navatelangana.com

జర్నలిస్ట్ కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఇటీవల అనారోగ్యం కారణంగా మరణించిన కెమెరామెన్ సుభాష్ కుటుంబానికి జర్నలిస్టు జేఏసీ పిలుపు మేరకు సేకరించిన ఆర్థిక సాయాన్ని అందించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కుటుంబ సభ్యులకు సేకరించిన రూ.52,100 అందించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జేఏసి నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకునేలా జర్నలిస్టులు తోచిన సాయం అందించారని తెలిపారు. కుటుంబాన్ని ఆదుకునేలా తమ వంతుగా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు నూకల దేవేందర్, సారంగపాణి, మెడపట్ల సురేష్, ఏర సుధాకర్, కలల అభిలాష్, అస్మత్ అలీ, నిలేష్ ఉన్నారు.

తప్పుడు అఫిడవిట్‌పై కేసు నమోదు

నవతెలంగాణ - కాసిపేట

తనపై ఎలాంటి కేసులు లేవని తప్పుడు అఫిడవిట్ చూపించి పోలీస్ వెరిఫికేషన్ కొరకై దరఖాస్తు చేసుకొని తప్పుడు ధ్రువపత్రాలను చూపి సర్టిఫికెట్లు పొందాలుకున్న కోవెల శ్రావణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం కేసు నమోదు చేసి అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. మండలంలోని స్టేషన్ పెద్దనపల్లికి చెందిన కోవెల శ్రావణ్ తనపై ఎలాంటి కేసులు లేవని తప్పుడు అఫిడవిట్ చూపించి పోలీస్ వెరిఫికేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్నాడు. పోలీస్ స్పెషల్ బ్రాంచ్ ఉన్నతాధికారులు దర్యాప్తు చేసి చెక్ బౌన్స్ కేసు ఉందని, ఆ వ్యక్తిపై కేసు నమోదు చేయాలని కాసిపేట పోలీసులకు సూచించారు. ఎవరైన తప్పుడు ధ్రువపత్రాలు చూపి సర్టిఫికెట్ పొందాలనుకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

రైతుకు న్యాయం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

గిరిజన రైతు జాదవ్ మోతీరాంకు న్యాయం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పని పద్మ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ముందు 57 రోజులుగా రైతు చేస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని వారు సందర్శించి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు రిలే నిరాహార దీక్ష చేస్తుంటే కలెక్టర్ ఏమాత్రం దృష్టి పెట్టకుండా ఉండడం సరైంది కాదన్నారు. వెంటనే ఆ రైతు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతుకు న్యాయం చేసేంతవరకు రిలే నిరాహార దీక్ష కొనసాగుతుందని, రైతుకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి తిమ్మాపురం ముత్తన్న, నిర్మల్ మండల అధ్యక్షులు బర్కుంట గంగారాం, దస్తురాబాద్ మండల అధ్యక్షులు కె.శ్రీనివాస్, కార్యదర్శి భూక్య విలాస్, ఖానాపూర్ మండల నాయకులు రాపల్లి రాజేష్ యాదవ్, జిల్లా కమిటీ సభ్యులు మామూల్లా కృష్ణదాస్ పాల్గొన్నారు.

మున్సిపల్ చెత్త వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు



నవతెలంగాణ - కాసిపేట

సోమగూడెం టోల్ గేట్ వద్ద గురువారం పెద్దనపల్లి, దుబ్బగూడెం గ్రామస్తులు బెల్లంపల్లి మున్సిపాలిటీ చెత్త వాహనాలను అడ్డుకొని ఆందోళన చేశారు. మండలంలోని సోమగూడెం పాత టోల్ గేట్ శివారులో బెల్లంపల్లి మున్సిపాలిటీ చెత్త డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి చెత్తను వేయడంతో 20 రోజులుగా జరుగుతున్న 'చెత్త' పంచాయతీ తెగడం లేదు. ఎన్ని సార్లు వద్దన్నా ఎందుకు వాహనాల్లో చెత్తను తీసుకువచ్చి పోస్తున్నారని, అనుమతులు ఎవరిచ్చారని, అనుమతులు చూపాలని స్థానికులు ప్రశ్నించారు. 20 రోజులుగా ఇదే తంతు సాగుతోందని, అడ్డుకుంటున్నా మళ్లీ మళ్లీ చెత్తను తీసుకొచ్చి డంప్ చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజు వారీగా భారీగా బెల్లంపల్లి మున్సిపాలిటీ వాహనాల్లో చెత్తను తీసుకొచ్చి పోయడం పట్ల మండి పడ్డారు. చెత్త వేసి కాల్చడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామస్తుల ఆందోళనతో పోలీసులు చేరుకున్నారు. మున్సిపాలిటీ చెత్త వాహనాలను గ్రామస్తులు తిరిగి పంపించారు. చెత్త వాహనాలు మళ్లీ వస్తే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెండె నవీన్, గోనెల శ్రీనివాస్, పెద్దనపల్లి, దుబ్బగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందుతున్న అధికారికి సన్మానం

నస్పూర్ : కార్పొరేట్ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ రవికుమార్‌ను గురువారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థకు వివిధ హోదాల్లో పనిచేసి సంస్థ అభివృద్ధిలో పాలుపంచుకున్న రవికుమార్ అభినందనీయులని తెలిపారు.



ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కె వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ప్రాజెక్టు ఆఫీసర్ ఏవీ రెడ్డి, డీజీఎం పర్సనల్ పి అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, ఆర్కే 5,6 గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, శ్రీరాంపూర్ గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్లు, డీవైసీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, ఏరియా స్టోర్స్ డీజీఎం మల్లయ్య, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో....

సింగరేణిలో సుదీర్ఘకాలంగా వివిధ హోదాల్లో పనిచేసి ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ పొందనున్న జీఎం మార్కెటింగ్ రవి ప్రసాద్‌ను తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మూడు గ్రామాలకు మినహాయింపు ఇవ్వాలి

జైపూర్: వేలాల అవతలి వైపున గల మూడు గ్రామాల వారి రాకపోకలకు ఇబ్బంది లేకుండా పార్కింగ్ వసూళ్ల నుండి మినహాయింపు ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ జాడీ ఏసయ్య, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు అర్నె సమ్మయ్య, శివ్వారం మాజీ సర్పంచ్ ఇంద్రారెడ్డి కోరారు. గురువారం ఏసీపీ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. వేలాల గ్రామం తర్వాత ఉన్న పొనూర్, శివ్వారం, గోపాల్‌పూర్ గ్రామాలకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. వేలాల జాతర సందర్భంగా సరిహద్దుల్లో పార్కింగ్ ఆంక్షలు అవకాశంగా పెట్టుకుని వాహనాల రాకపోకలను అడ్డుకోకుండా చూడాలన్నారు. ఆధార్, ఓటరు ఐడీ, రేషన్‌కార్డుల్లో ఏదో ఒకటి నిర్ధారించి వాటి ఆధారంగా ఆంక్షలు లేకుండా ప్రయాణించడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



క'న్నీటి' కష్టాలు షురూ..!

- ఏజెన్సీలో మొదలైన తాగునీటి ఎద్దడి
- పలు పల్లెల్లో సరఫరా కాని భగీరథ నీరు
- పైప్‌లైన్ల లీకేజీలతో తీవ్రంగా సతమతం
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరిచిన అధికారులు
- తాగునీటికి తిప్పలు పడుతున్న ఆదివాసీ గిరిజనులు

ఉమ్మడి జిల్లాలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. వేసవి ఆరంభంలోనే కొన్ని పల్లెలు తాగునీటికి అల్లాడుతున్నాయి. పల్లెపల్లెకు చేరిన మిషన్ భగీరథ పథకం క్షేత్రస్థాయిలో పనిచేయడం లేదు. పైప్‌లైన్ల లీకేజీలు, విద్యుత్తు సమస్యలు, కనెక్షన్లు ఇవ్వకపోవడం వంటి సమస్యల కారణంగా తాగునీటి ఎద్దడి తప్పడం లేదు. అప్పుడే పల్లెలు గొంతు తడుపుకొనేందుకు నానా తిప్పలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఈ వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేయగా.. అధికారయంత్రాంగం సైతం ఇందుకు కింది స్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. భగీరథ నీరు రాని చోట్ల ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలని స్పష్టంచేసింది. కానీ అనేక చోట్ల మిషన్ భగీరథ ట్యాంకులు వృధాగా ఉంటున్నాయి. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకోవాల్సిన భగీరథ అధికారులు అటువైపు దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి. పంచాయతీలే పరిష్కరించాలని చెబుతూ చేతులు దులిపేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ప్రతి ఏటా తాగునీటి కష్టాలు సాధారణంగా మారాయి. మిషన్ భగీరథ పథకం వచ్చినా ఇంకా అనేక మారుమూల గ్రామాలు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నాయి. కొండలు, గుట్టలు అధికంగా ఉండటం..వాటిని దాటి పైప్‌లైన్లు వేయడం..ట్యాంకులకు కనెక్షన్లు ఇవ్వకపోవడం..మరోపక్క పైప్‌లైన్ల మరమ్మతుల కారణంగా తరుచూ నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. కొన్ని చోట్ల ట్యాంకులకు నీరు ఎక్కకపోవడం..మరికొన్ని చోట్ల ట్యాంకుల నీటిని సరఫరా చేసే సంపుల వద్ద సాంకేతిక సమస్యల కారణంగానూ నీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రతి ఏటా ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నా భగీరథ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాల్సి ఉన్నా నిధులు లేవనే కారణంగా అలాగే విడిచిపెడుతున్నారు. ఫలితంగా వేసవి రాగానే మారుమూల పల్లెల్లో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కనీసం మండల స్థాయి అధికారులు ఆయా గ్రామాలను చుట్టి వచ్చినా సమస్యలు తెలిసేందుకు అవకాశం ఉంటుంది. కానీ కార్యాలయం నుంచి కదలని కారణంగా క్షేత్రస్థాయిలో జనం పడుతున్న బాధలు వారి దృష్టికి రావడం లేదనే వాదన వినిపిస్తోంది.

జాగ్రత్త పడకపోతే పరిస్థితి తీవ్రం..!

ఉమ్మడి జిల్లాలో ప్రతి ఏటా తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుంది. అధికార యంత్రాంగం సైతం అప్రమత్తం కావాల్సిన ఆవశ్యకత ఉంటుంది. మిషన్ భగీరథ పథకం వచ్చిన నుంచి తాగునీటి కోసం ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు రాకపోవడంతో అధికారులు మరమ్మతులు కూడా చేయించలేని పరిస్థితి



కనిపిస్తోంది. ఈ క్రమంలో పైప్‌లైన్లు ఇతరాత్ర సమస్యల పరిష్కార బాధ్యత ప్రభుత్వం పంచాయతీలకే అప్పగించింది. అసలే పంచాయతీలకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి నిధులు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటే..తాజాగా తాగునీటి బాధ్యత కూడా వాటికే అప్పగించడం సమస్యగా మారుతోంది. అధికారులు ఇప్పటికైనా మారుమూల పల్లెలకు వెళ్లి సమస్యలను గుర్తించడమే కాకుండా వాటి పరిష్కారానికి చర్యలు చేపడితే తాగునీటి తాపాన్ని అరికట్టేందుకు అవకాశం ఉంటుంది. మరోపక్క ప్రభుత్వం సైతం పంచాయతీలపై బాధ్యత పెట్టే ప్రయత్నం చేయకుండా మరమ్మతుల కోసం నిధులు కేటాయిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే పంచాయతీల్లో చేతిపంపులు మరమ్మతులు గురికావడంతో కొన్నింటికి మరమ్మతులు చేపట్టారు. కానీ భగీరథ సమస్యలను సైతం పరిష్కరించాల్సిన అవసరం ఉంటుంది.



ఇచ్చోడ మండలం బాబ్జీపేట గ్రామం పరిధిలోని సోమన్నగూడలో నిర్మించిన భగీరథ నీటి ట్యాంకు ఇది. అడవికి ఆనుకొని నిర్మించిన ఈ ట్యాంకుకు భగీరథ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వలేదు. గ్రామంలో నల్లాలు బిగించలేదు. దీంతో ఈ పల్లెవాసులకు భగీరథ ఎలా ఉంటదో తెలియని పరిస్థితి ఉంది. మారుమూల పల్లెల్లో అనేక చోట్ల ఇలాంటి పరిస్థితులున్నాయి.

మరమ్మతులు చేయించాం : చంద్రమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ

జిల్లాలో పంచాయతీ అధికారులు, సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. చేతిపంపులు, మోటార్లకు మరమ్మతులు చేయించాం. ఎక్కడైనా పైప్‌లైన్లు లీకేజీలకు గురైతే పంచాయతీలే చేయించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల కాలేదు.



ఇంద్రవెల్లి మండలం తేజాపూర్ పంచాయతీ పరిధిలోని సాలెగూడ గ్రామంలో దుస్థితి ఇది. పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా తాగునీరు ట్యాంకులోకి ఎక్కడం లేదు. దీంతో వాటర్ ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇదే మండలంలోని హర్కాపూర్‌లో భగీరథ నీరు రాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సీసీ కెమెరాల ముసుగులో గంజాయి అమ్మకాలు

- గుట్టు రట్టు చేసిన రామగుండం కమిషనరేట్ పోలీసులు
- రూ.11.75లక్షల విలువైన 23.5కిలోల గంజాయి స్వాధీనం
- 22మందిపై కేసు, 11మంది అరెస్ట్



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంగా జరుగుతున్న అక్రమ గంజాయి వ్యాపారాన్ని రామగుండం పోలీసులు ఛేదించారు. ఐబీ చౌరస్తాలో పెద్ద మొత్తంలో గంజాయి పట్టుకున్నారు. ఈ ఘటనలో 22 మందిపై కేసు నమోదు చేయగా, 11 మంది నిందితులను అరెస్టు చేశారు. మిగతా వారు పరారీలో ఉన్నారు. గురువారం రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాంప్లెక్స్ కింద సెల్లార్‌లో సోమ ప్రవీణ్ వై ఇన్ఫో సొల్యూషన్స్ పేరుతో సీసీ కెమెరాల వ్యాపారం నడిపిస్తున్నాడు. ఇందులో గంజాయి వ్యాపారం సాగుతోందని పోలీసులకు సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టారు. దీంతో భారీగా గంజాయి పట్టుబడింది. రూ.11.75 లక్షల విలువైన 23.5 కిలోల గంజాయి పట్టుకున్నారు. అక్కడున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇరుగురాళ్ల సతీష్ కుమార్, మహ్మద్ సమీర్, టీమ అనుదీప్, మొహమ్మద్ అబ్దుల్ ఉబేద్, అర్జున్ రాకేష్, శ్రీధర్, మున్నీ, చింటూ, అల్మేకర్ శ్యామ్, క్వార్టర్ సాయి, సోహెల్ పరారీలో ఉన్నారు. వీరు ఆంధ్ర ప్రాంతంలోని సీలేరు నుంచి గంజాయి తీసుకొచ్చి అమ్ముతున్నారు. జనవరి మొదటి వారంలో అందరూ తలా కొన్ని డబ్బులు వేసుకొని సీలేరు వెళ్లి కారులో గంజాయి తీసుకొస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు పోలీసులతో ఇబ్బందులు లేకుండా బైకులపై ఫాలో అయ్యారు. మళ్లీ ఫిబ్రవరి 1న కారులో మ్యాట్లు, సీట్ల కింద గంజాయి తీసుకొచ్చారు. దీన్ని సోమ ప్రవీణ్ సీసీ కెమెరాల గోదాంలో దాచి ఉంచారు. ఇందులో కొందరు వ్యక్తులు దాదాపు పది కిలోల మేర అమ్మేందుకు తీసుకెళ్లారు. పోలీసులకు పక్కా సమాచారం రావడంతో గోడౌన్‌పై దాడి చేసి గంజాయి పట్టుకున్నారు. గంజాయిని తూకం వేయడానికి ఉపయోగించే ఎలక్ట్రానిక్ కాంటా, సెల్ ఫోన్, మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాపై ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద సీఐ ప్రమోద్‌కుమార్ కేసు నమోదు చేశారు. ముఠాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన టాస్క్‌ఫోర్స్ మంచిర్యాల సిబ్బందిని సీపీ శ్రీనివాస్ అభినందించారు. సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, డీసీపీ(అడ్మిన్) రాజు, ఏసీపీలు రాఘవేంద్ర, ప్రకాశ్, మల్లారెడ్డి, సీఐలు ప్రమోద్, రాజ్‌కుమార్, రమేష్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు లచ్చన్న, ఉపేందర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అధికారులు దూషించారని ఆత్మహత్యాయత్నం



నవతెలంగాణ-జన్నారం


మండలంలోని దేవునిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని గడ్డంగూడకు చెందిన రాథోడ్ తుకారాం అటవీ అధికారులు దూషించారని పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..రెండు రోజులు క్రితం అటవీ అధికారులు గడ్డంగూడ వాసుల గుడిసెలను తొలగించారు. గురువారం అటవీ అధికారులు మరోసారి అక్కడికెళ్లి స్థలం ఖాళీ చేయాలని, ఇక్కడ సీసీ కెమెరాలు బిగిస్తామని తెలిపారు. దీంతో గూడెం వాసులకు, అధికారులకు వాగ్వివాదం జరిగింది. సుమారు 30సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటున్నామని, తమ ఇండ్లను ఎవరూ తొలగించలేదని అధికారులకు విన్నవించారు. రెండు మూడు రోజులు సమయం ఇవ్వాలని, పైఅధికారులను కలుస్తామని వేడుకున్నారు. అయినా అటవీ అధికారుల వినకుండా దుర్భాషలాడారని గూడెం వాసులు ఆరోపించారు. ఒకవేళ అధికారులు స్పందించకుంటే స్థలం పూర్తిగా ఖాళీ చేసి వెళ్తామన్నా అధికారులు వినలేదన్నారు. దీంతో మనస్తాపం చెందిన తుకారాం పురుగులమందు తాగాడు. హుటాహుటిన ఆయనను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తుకారాం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఈ విషయంపై ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావును వివరణ కోరగా తాము ఎవరినీ దూషించలేదని, దురుసుగా మాట్లాడలేదని తెలిపారు. కేవలం అటవీ భూముల్లో సీసీ కెమెరాలు బిగిస్తామని అంటేనే వారు గొడవకు దిగారని పేర్కొన్నారు.

కారును ఢీ కొట్టిన లారీ

- మంటల్లో దగ్ధమైన కారు
- మహిళ మృతి
- మేనల్లుడి పెళ్లి రోజు మృతి చెందిన మేనత్త
- ఆగిన పెండ్లి, ఇరు కుటుంబాల్లో విషాదం

నవతెలంగాణ-హాజీపూర్

మేనల్లుడి పెండ్లి సంబరాల్లో ఉన్న మేనత్త అంతలోనే మృతి చెందడంతో ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది. పెండ్లి పిల్లను వారింటికెళ్లి తీసుకొస్తానని చెప్పి వెళ్లిన మేనత్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. దీంతో ఆ వివాహ వేడుక రద్దు కాగా వధూవరుల ఇళ్లల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటన గురువారం తెల్లవారు జామున జరిగింది. మహిళ మృతి చెందగా, కారు మంటల్లో దగ్ధమైంది. ఎస్సై గోపతి సురేష్ వివరాల ప్రకారం..లక్షెట్టిపేట మండలం ముత్యంపేట గ్రామ శివారులో జాతీయ రహదారిపై మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపు వెళుతున్న లారీ లక్షెట్టిపేట నుంచి మంచిర్యాల వైపు వస్తున్న కారును లారీ డ్రైవర్ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడపుకుంటూ వచ్చి అతివేగంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో భీమిని మండలం వీగామ్ గ్రామానికి చెందిన కర్రే రాజు(49) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంలో కారు డీజిల్ ట్యాంక్ లీకేజీ అయి మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమైంది. మృతురాలు రాజుకు భర్త మల్లయ్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఆగిపోయిన వివాహ వేడుక

భీమిని మండలం వీగాంలో గురువారం తన మేనల్లుడు బీరేశ్ పెళ్లి కావడంతో జూలపల్లి మండలం అబ్బాపూర్‌లోని పెళ్లి కుమార్తెను తీసుకొచ్చేందుకు బుధవారం పెళ్లి కుమార్తె ఇంటికి వెళ్లింది. రాత్రి పెళ్లి కుమార్తెను ముస్తాబు చేసి కారులో వీగాంకు బయలుదేరారు. గురువారం అర్ధరాత్రి దాటాక తెల్లవారు జామున హాజీపూర్ మండలం మీదుగా వెళ్తుండగా వీరి కారును ఓ లారీ అతివేగంగా ఢీ కొట్టడంతో కారులో ఉన్న కర్రే రాజు(49) బయటపడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. కారులో ఉన్న పెళ్లికుమార్తె, ఇతర బంధువులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. తన పెళ్లి రోజునే మేనత్త మృతి చెందడంతో మేనల్లుడితో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. మేనత్త మృతితో వివాహ వేడుక రద్దు కాగా వధూవరుల ఇళ్లల్లో తీరని విషాదం నెలకొంది.



దగ్ధమవుతున్న కారు

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం



నవతెలంగాణ- నేరడిగొండ

మండలంలోని కుంటాల-కె గ్రామ ఆశ్రమ పాఠశాలలో వైద్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు సిబిపి, హెచ్‌బి తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ మాట్లాడుతూ విద్యార్థినులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, పరిశుభ్రత పాటించాలని తెలిపారు. పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌టి ఉత్తం సింగ్, ఎంఎల్‌హెచ్‌పి వాణి, ఏఎన్ఎం జ్యోతి, జీఎన్ఎం అశ్విని, ప్రధానోపాధ్యాయులు అంబారావ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | ఫిబ్రవరి 21, 2025 | www.navatelangana.com

అద్దె భవనంలోకి దుబ్బగూడ పాఠశాల

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



మావల మండలంలోని బట్టిసవర్గాం గ్రామపంచాయతీ పరిధిలోని మోడల్ కాలనీలోని హనుమాన్ ఆలయంలో స్కూల్ నడుపుతున్నట్టు వచ్చిన వార్తపత్రికల కథనంతో ముఖ్యమంత్రి స్పందించారు. దీంతో గురువారం ఆ పాఠశాలను అద్దె భవనంలోకి మార్చినట్టు ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు స్కూల్ బిల్డింగ్ లీజుకు తీసుకొని మార్చడం జరిగిందని పట్టభద్రుల ఎన్నికలు ఉండటంతో వాయిదా వేస్తూ మరో పక్క భవనంలోకి మార్చడం జరిగిందన్నారు. ఎన్నికలు అయిన తర్వాత స్కూల్ బిల్డింగ్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ వినోద్ కుమార్, డీఈఓ ప్రణీత, ఎంఈఓ సరోజ, ప్రధానోపాధ్యాయులు గిరిధర్ రెడ్డి, ఉపాధ్యాయులు ధర్మ జ్యోతి కాలనీవాసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నిర్మల్

ఇటీవల రాంచంద్రారెడ్డి ఎంఈఓ అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో గల వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మాజీ మంత్రితో పాటు ప్రముఖ పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, నాయకులు రమణరెడ్డి, వి.మహేష్, గజేందర్, వంశీ, రవీందర్‌రెడ్డి, రాందాస్ సర్పంచ్, సాగర్‌రావు, పాకాల రాంచందర్, అనుముల భాస్కర్, రవి ఉన్నారు.



పోగొట్టుకున్న సెల్ ఫోన్‌లు అప్పగింత



నవతెలంగాణ-సిరికొండ

నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సెల్ ఫోన్‌లను వెతికి పెట్టడంలో ఇచ్చోడ సర్కిల్ పోలీసులు మంచి ఫలితాలు సాధించారు. మండలంలో ఏడుగురు తమ సెల్ ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సీఈఐఆర్ అప్లికేషన్‌ను ఉపయోగించి ఏడుగురి సెల్ ఫోన్లను వెతికి పట్టుకున్నారు. సర్కిల్ సీఐ భీమేష్ బాధితులను గురువారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించుకొని సెల్ ఫోన్లను అందజేశారు. ఎవరైనా సెల్ ఫోన్లు పోగొట్టుకుంటే ఫిర్యాదు చేయాలని సీఈఐఆర్ ద్వారా పోగొట్టుకున్న సెల్ ఫోన్లను అందేలా చూస్తామన్నారు. ఇందులో ఎస్సై శివరాం, కానిస్టేబుల్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి ముఖ్యకార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ సునీల్ బన్సల్ అన్నారు. గురువారం పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై నిర్మల్ జిల్లా కేంద్రంలోని హోటల్‌లో బీజేపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమిష్టిగా కృషి చేసి రెండు స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సునీల్ బన్సల్, చంద్రశేఖర్, అలాగే కార్యక్రమానికి హాజరైన నాయకులు రామచంద్రారెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, ఎంపి నగేష్, ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యలను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాల్వాయి హరీష్, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, బీజేపీ నాయకులు ఇన్‌చార్జిలు, కన్వీనర్లు పాల్గొన్నారు.

బావను చంపిన బామ్మర్ది అరెస్ట్



నవతెలంగాణ-తలమడుగు

బావను చంపిన హత్య కేసులో బామ్మర్ది అశోక్‌ను పోలీసులు అరెస్ట్, కోర్టులో హజరుపర్చి, రిమాండ్‌కు తరలించినట్టు సీఐ ఫణిధర్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో వివరాలను సీఐ వెల్లడించారు. ఈనెల 18న మండలంలోని రుయ్యాడికి చెందిన మహేందర్‌ను అతడి బామ్మర్ది అశోక్ హత్య చేసిన ఘటనలో అరెస్ట్ చేసి హత్యకు గల వివరాలను నింధితుడి నుంచి సేకరించి, కోర్టులో హజరు పరిచామని తెలిపారు. సీఐ వెంట తలమడుగు ఎస్సై బి.అంజమ్మ, రూరల్ ఎస్సై ముజహిద్ ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

నవతెలంగాణ-నేరడిగొండ

బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్యలను గెలిపించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఆకుల రాజశేఖర్ అన్నారు. గురువారం బీజేపీ కార్యాలయంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు గట్టు నారాయణ, జిల్లా విశ్వకర్మ యోజన కన్వీనర్ చొక్కపల్లి రాములు, మాజీ జెడ్పీటీసీ గడ్డం భీంరెడ్డి, మాజీ సర్పంచ్ పరశురాం జాదవ్, మాజీ ఎంపీటీసీ రాజు, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తీగల నవీన్, పోలింగ్ బూత్ అధ్యక్షులు రంజిత్, శ్రీధర్ రెడ్డి, బంటు ప్రవీణ్, ఉత్తం, రాజేందర్ రెడ్డి, కోటేష్, మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేష్, ప్రకాష్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

భైంసా : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని, మేధావులు ప్రభుత్వంపై పోరాడే వ్యక్తులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని భైంసా బీజేపీ మండలాధ్యక్షురాలు సిరం సుష్మరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మహాగాం, చింతల్‌బోరి, గుండేగాం, కోతుల్గాం, గ్రామాల్లో ప్రచార పర్వాన్ని చేపట్టిన సందర్భంగా ఆమె మాట్లాడారు. బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి కొమురయ్యకు పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో మహాగాం మాజీ సర్పంచ్ అప్పాల రాకేష్, మాజీ సర్పంచ్ చిన్నన్న, కురుమ కృష్ణ, సోనారి యోగేష్, శంకర్, యోగేష్, భోజన్న, సాయినాథ్, తిరుపతి, దత్తాత్రి, అఖిల్ పటేల్, లక్ష్మి, గజ్జరాం పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో రాణించాలి



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం లక్ష్మణచాంద కేజీబీవీ పాఠశాలలో ధర్మసేవ చారిటబుల్ ట్రస్ట్, ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థిని, కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి బాల శక్తి నూతన ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి, జిల్లాలోని 57 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ పాఠశాలల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. బాల శక్తి కార్యక్రమం ద్వారా ఆర్థిక అక్షరాస్యత, ఆరోగ్యం, నైపుణ్యాల పెంపు, క్షేత్ర పర్యటనలు వంటి అంశాలపై విద్యార్థినులకు పూర్తి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బాలశక్తి కార్యక్రమాన్ని మరింత పటిష్టం చేయడానికి, అదనంగా ధర్మసేవ, ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సారధ్యంలో ధ్యానం, యోగ, నైతిక విలువలతో కూడిన విద్య, ఆటలు, మార్షల్ ఆర్ట్స్ వంటివి జోడిస్తూ, విద్యార్థులను అన్ని అంశాల్లో పరిపుష్టం చేయడం జరుగుతుందని అన్నారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలని, ప్రతీ విద్యార్థిని ఉద్యోగం సాధించాకనే, తమ పెళ్లి గురించి ఆలోచించాలని, ఆలోచిస్తామని విద్యార్థినులు అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు కలెక్టర్ పాఠాలు బోధించారు. లెక్కలను చేయించి జవాబులు రాబట్టారు. అంతకుముందు కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈఓ పి.రామారావు, ధర్మసేవ చారిటబుల్ ట్రస్ట్, ధీర ఫౌండేషన్ ప్రతినిధి నిశాంత్‌రెడ్డి, తహసీల్దార్ జానకి, ఎంపీడీఓ రాధా, విద్యాశాఖ అధికారులు పద్మ, ఎస్.ప్రవీణ్ కుమార్, వినోద్ కుమార్, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి నవిత, ప్రత్యేక అధికారిణులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మలిదశలో కేసీఆర్ ఆధ్వర్యంలో సిద్ధించిన తెలంగాణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తొలిదశ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష నేరవేరలేదని, మలిదశలో మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధించిందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్ అన్నారు. తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన రోజు ఫిబ్రవరి 20ని పురస్కరించుకొని బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణకు అనుకూల నినాదాలు చేస్తూ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నేతృత్వంలో జరిగిన ఉద్యమంతో 2014 ఫిబ్రవరి 20న కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లును అమోదించిందన్నారు. తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ పదేండ్ల పాలనలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేశారన్నారు. ప్రస్తుతం అధికారంలో రక్షస కాంగ్రెస్ ఉందని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తు పాలన సాగిస్తుందన్నారు. ప్రజలు విసుగుచెంది కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, శివకుమార్, దాసరి రమేష్, సాజిదొద్దిన్, ధమ్మపాల్ పాల్గొన్నారు.

రన్నింగ్ కిలోమీటర్ల అలవెన్స్ పెంచాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైల్వేశాఖ పెంచిన డీఏకు అనుగుణంగా రన్నింగ్ కిలోమీటర్ల అలోవెన్స్‌లను పెంచాలని ఆల్ ఇండియా రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆదిలాబాద్ బ్రాంచ్ కార్యదర్శి సురేష్, సంతోష్ కుమార్ కోరారు. గురువారం రైల్వే స్టేషన్‌లో ఆల్ ఇండియా రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్, ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో లోకో పైలట్లు 36 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ డీఏ పెంచిన శాఖ లోకో పైలట్లకు కిలోమీటర్ అలవెన్స్ పెంచలేదన్నారు. అలవెన్స్‌లో 70 శాతం ఇన్కం ట్యాక్ మినహాయింపు ఇవ్వాలని కోరారు. అదే విధంగా కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల సాధన కోసం 36 గంటల నిరాహార దీక్షలు చేస్తున్నామన్నారు. ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రైళ్ల నడుపుతూ తమ నిరసనను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నామని వేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సిరాజ్ అలం, కోశాధికారి అశిష్ రంజన్, ప్రేమశంకర్, నవీన్, నస్రత్ అలీ, సునీల్ కుమార్, హేమంత్ కుమార్, జితేందర్ పాల్గొన్నారు.

పెండింగ్ పీఎఫ్, పీఆర్సీ వేతనాలివ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, పీఆర్సీ వేతనాలివ్వాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు దర్శనాల నగేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న డిమాండ్ చేశారు. గురువారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ 12 నెలల నుంచి పీఎఫ్ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని చెల్లించడంతో పాటు 2వ పీఆర్సీలో రూ.26వేల వేతనం ఇవ్వాలన్నారు. తమ వేతనాల నుంచి పీఎఫ్ కోత విధిస్తున్నారని, కానీ వాటిని ఇప్పటి వరకు జమ చేయడం లేదన్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించిన ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. కార్మికులకు వెండింగ్‌లో ఉన్న 10 గ్రూపుల ఎరియర్స్‌తో పాటు పీఎఫ్‌ను చెల్లిచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ఆత్మరామ్, అజీం, భాస్కర్, జనార్ధన్, రాకేష్‌రెడ్డి, స్వామి, గగన్, వెంకటి, సాయికృష్ణ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు, పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయం, ఎన్టీఆర్ స్టేడియం పక్కనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయ, గ్రాడ్యుయేషన్ పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల మెటీరియల్, బ్యాలెట్ బాక్స్‌లు, ఓటింగ్ మెషీన్లు, ఇతర అవసరమైన సామగ్రి సమయానికి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు తగిన సూచనలు అందించాలని, వారికి పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణ జరగాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశీలనలో కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, జెడ్పీ సీఈఓ గోవింద్, తహసీల్దార్‌లు రాజు, సంతోష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఆర్లి, లాండసాంగి, నిషాన్‌ఘాట్ శాఖ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకపై ప్రభుత్వం జీఎస్టీ విధించి, పన్ను మీద పన్నుతో వెన్ను పోటు పొడుస్తోందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం జిల్లాకు ఒక రూపాయి కూడా బడ్జెట్ ఇవ్వలేదని అన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ, ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైలు, ఏర్పాటుకు ఎలాంటి బడ్జెట్ కేటాయించలేదన్నారు. కేవలం కులమత రాజకీయాలు చేస్తుందన్నారు. దీన్ని ఎదిరించడానికి యువత, మహిళ లోకం, రైతు కార్మికులందరూ ఏకం కావాలని ఇక్కడ ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మంచినీటి సౌకర్యం, కరెంటు సౌకర్యం, రోడ్లు వెంటనే నిషాన్‌ఘాట్ కాలనీకి మంజూరు చేయాలని తీర్మాణించారు. కార్యక్రమానికి సభాధ్యక్షులు నూతనంగా ఎన్నుకున్న శాఖ కార్యదర్శి కార్తీక్, ముఖ్య అతిథులు జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, భారత జాతీయ మహిళా సమాఖ్య ఎస్ఎఫ్ఐడబ్ల్యూ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమీనాఖాన్ బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు ఖండాల గణేష్, డాక్టర్ బాబా ఇంకా శాఖ పార్టీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో చర్చించాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఎస్సీ వర్గీకరణ అంశంపై ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ అసెంబ్లీలో చర్చించాలని మాల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మాలలకు జరిగిన అన్యాయంపై అసెంబ్లీలో చర్చించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బిల్లులో 2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయడాన్ని సుప్రీం కోర్టు చెప్పిన విధంగా ముందుకు వెళ్లాలని అన్నారు. జిల్లా కన్వీనర్ బత్తుల రంజిత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వర్గీకరణ బిల్లును వెనక్కి తీసుకోక పోతే కాంగ్రెస్‌ని వచ్చిన ఎన్నికల్లో ఓడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అదిలాబాద్ మాల సంఘం నాయకులు బేర దేవన్న, ముల్కల రాజేశ్వర్, పాశం రాఘవేందర్, మేదరి స్వామి, సింగరి అశోక్, నిర్మల్ జిల్లా కన్వీనర్ కుంటోళ్ల వెంకట స్వామి, కోకన్వీనర్లు బొడ్డు లక్ష్మణ్, ఆకుల రమేష్, పులి అశోక్, కాంతం మురళీధర్, పురుషోత్తం, దేవోల్ల మధు, మధస్తు భూమేశ్, శ్రీనివాస్, సాయన్న, నర్సన్న, రాజలింగం, సంపత్, రాజు, వినోద్, నవీన్, సుధీర్ పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న మొహమ్మద్ ముబారక్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ అధ్యాపకులుగా విధులు నిర్వర్తిస్తున్న మొహమ్మద్ ముబారక్ డాక్టరేట్ అందుకున్నారు. ఎలక్ట్రోల్ సిస్టమ్స్ అండ్ డెమోక్రటిక్ గవర్నెన్స్ ఎనలైజింగ్ ది ఎఫెక్ట్ అఫ్ ప్రపోషనల్ రిప్రజెంటేషన్ ఆఫ్ పొలిటికల్ స్టెబిలిటీ అనే అంశంపై డాక్టర్.మహేందర్ సింగ్ మార్గదర్శకత్వంలో పరిశోధన చేశారు. నీలం యూనివర్సిటీ, కైతల్ నుంచి ఈ పట్టా అందుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం కళాశాల సిబ్బంది ఆయనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ రఘు గణపతి, అధ్యాపకులు కరుణాకర్, రేఖ, కోటయ్య, చంద్రకాంత్, స్వప్న, అనిత, యాకూబ్ అలీ, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలుంటే తెలియజేయాలి



నవతెలంగాణ-నేరడిగొండ

ప్రజలు సమస్యలుంటే తమకు తెలియజేయాలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండలంలోని వడూర్ గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వార్డుల్లో తిరుగుతూ ప్రజలను కలిసి ఎమైనా సమస్యలుంటే తమకు తెలియజేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించేందుకు తాము అండగా ఉంటామని గ్రామస్తులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల శంకర్, గ్రామస్తులు గాదె శంకర్, ఉప్పు పోశెట్టి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అపార్ ఐడీ గడువులోగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-కౌటాల



ఆధార్ వివరాలు అపార్ ఐడీ గడువులోగా పూర్తి చేయాలని ఎంఈఓ గావుడె హనుమంతు అన్నారు. గురువారం మండల విద్యా వనరుల కేంద్రంలో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి వారికి సూచించారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని పిల్లల ఆధార్ వివరాలు, అపార్‌లను యు డైస్ ప్లస్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు హెచ్ఎం నానాజీ, నారాయణ సింగ్, సీఆర్పీలున్నారు.

విద్యార్థి దశలో పదవ తరగతి కీలకం

నవతెలంగాణ-తిర్యాణి



విద్యార్థి దశలో పదవ తరగతి అతి కీలకమైందని మండల విద్యాధికారి కె అంజయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో గురువారం టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన మోటివేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో భయాందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా చదువుకొని పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం కెరీర్ గైడెన్స్ కౌన్సిలర్ పి రాజేందర్ విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకర్, కృష్ణారావు, షేకు, టీయూటీఎఫ్ నాయకులు జనార్దన్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నరేందర్‌రెడ్డిని గెలిపించాలి: సీతక్క



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని, నిరుద్యోగ యువతకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తాడని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క తెలిపారు. పట్టణంలోని ఓ గార్డెన్‌లో గురువారం నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ దశలవారిగా నెరవేర్చుకుంటు వస్తోందని చెప్పారు. దశాబ్దకాలం పాలించిన బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి లేకుండా పోయిందని, జిల్లాలో తాను ఇన్‌చార్జి మంత్రిగా సీసీ రోడ్లు, బీటీ రోడ్లకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రుణమాఫీ, మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించామని తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు కేటాయించడంలేదని, మతం, కులం పేరుతో రాజకీయాలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరిస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దేశంలో కులగణన చేపట్టాలని హితవు పలికారు. పక్కనున్న మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్‌కు రోడ్ల నిర్మాణాలకు కేంద్రం అనుమతులిస్తోందని, తెలంగాణలో ఎందుకు అనుమతులు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ కుటుంబ పాలన అనే బీజేపీ నాయకులు వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. రాహుల్‌గాంధీ అన్ని కులాలకు చెందిన వారని, రాజీవ్ గాంధీ మరణించి 30 సంవత్సరాలు వస్తున్న అవకాశం ఉన్న ఆ కుటుంబం నుంచి ఏ ఒక్కరూ ప్రధాన మంత్రి కావాలని కోరుకోలేదని తెలిపారు. రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు నరేందర్‌రెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. ఇందులో ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, మాజీ ఎంపీ సోయం బాబురావు, మాజీ మంత్రి వేణుగోపాల చారి పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి : సీఐటీయూ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దహెగాం మండల కేంద్రంలో ఐకేపీ వీఓఏపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్ డిమాండ్ చేశారు. వీఓఏలతో కలిసి గురువారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దహెగాం మండల కేంద్రంలో మండల సమైక్య కార్యాలయంలో గ్రూప్ సభ్యుల సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఒక గ్రూప్ సభ్యురాల భర్త వచ్చి మిగతా సభ్యుల ఎదురుగా ఏ కారణాలు లేకుండా వీఓఏపై కాళ్లతో దాడి చేసి బూతులు మాట్లాడాడని తెలిపారు. దాడులు చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని, లేని పక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుద్దు, రోజా, ధనరాజ్, సంతోష్, తిరుపతి, వనిత, అన్నపూర్ణ, రమ, సుమలత, మహేశ్వరి, అంకన్న, స్వప్న, స్వాతి, వెంకటేష్, భారత్ పాల్గొన్నారు.

పీఎం శ్రీ పథక పాఠశాలల అభివృద్ధికి చర్యలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ప్రధానమంత్రి శ్రీ పథకం కింద ఎంపికైన ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. గురువారం ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి గమ్మనియల్‌తో కలిసి పాఠశాలలలో చేపట్టే కార్యకలాపాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంపికైన పాఠశాలలలో శాశ్వత ప్రాతిపదికన చేపట్టిన మౌలిక వసతులు, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, బాలికల మూత్రశాలల నిర్మాణం, ప్రహరీ గోడల నిర్మాణాల పనులను త్వరగా పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా సిద్ధం చేసి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులకు పూర్తి స్థాయి సౌకర్యాల నడుమ నాణ్యమైన విద్యా బోధన అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ పై విద్యార్థులకు పాఠశాలలలో కమిటీలు ఏర్పాటు చేయాలని, తరగతులు మెటీరియల్స్ కొనుగోలు చేయాలన్నారు. పాఠశాలలో రాజ్యాంగంపై అవగాహన, గ్రీవెన్స్ బాక్సులు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు వ్యక్తిగత రక్షణకై 3 నెలల పాటు కరాటే శిక్షణ అందించాలని, పర్యావరణ అవగాహన కొరకు విద్యార్థులను సమీప అటవీ, గార్డెన్‌లకు తీసుకువెళ్లాలని సూచించారు. గ్రీన్ పథకంలో భాగంగా పాఠశాలలో మొక్కలు నాటడం, సంరక్షించడంపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు ఆబిద్ అలీ, మధుకర్, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

రేపు సేవాలాల్ జయంతి సాధారణ సెలవు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో నిర్వహించే సేవాలాల్ జయంతి వేడుకలను పురస్కరించుకొని రేపు సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సెలవు విద్యాసంస్థలకు కార్యాలయాలకు వర్తిస్తుందని, దీనికి బదులుగా ఏప్రిల్ నెలలో వచ్చే రెండవ శనివారం పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వేసవి కాలం సమీపిస్తున్నందున జిల్లాలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, డీఆర్‌డీఓ దత్తారాం, డీపీఓ భిక్షపతి గౌడ్‌తో కలిసి వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం సమీపిస్తున్నందున జిల్లాలో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీలో మిషన్ భగీరథ ద్వారా నీరు అందించాలని, పథకంలో ఏమైనా మరమ్మత్తులు, పైప్ లైన్ల లీకేజీలు, మోటార్ల మరమ్మత్తులను గుర్తించి వెంటనే పూర్తి చేయాలన్నారు. ఏజెన్సీ మండలాలు తిర్యాణి, లింగాపూర్, జైనూర్, కెరమెరి, సిర్పూర్(యు)లోని ఆవాస ప్రాంతాలకు తాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి వనరులను గుర్తించాలని, అవసరం ఉన్న ప్రాంతాలలో గ్రామ పంచాయితీ ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పని చేసి గత అనుభవాల దృష్ట్యా వేసవిలో సమస్య లేకుండా చూడాలన్నారు. వ్యవసాయ పనులు ముగిసినందున కూలీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించాలని, ప్రతి గ్రామపంచాయతీ నుండి 100 రోజులకు తక్కువ కాకుండా పని కల్పించాలని, ఆ దిశగా ఉపాధి హామీ సిబ్బందికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు పైలట్ గ్రామాల్లో ఎంపికైన లబ్దిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలు అందించాలని, ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



క్రెడిట్ ప్లాన్ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎల్‌డీఎం, అధికారులు

బ్యాంకర్లు వార్షిక రుణ లక్ష్యాలను సాధించాలి

ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించే దిశగా బ్యాంకర్లు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, నాబార్డ్ జనరల్ మేనేజర్‌తో కలిసి జిల్లా స్థాయి 3వ త్రైమాసిక సమీక్ష సమావేశానికి హాజరై బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగానికి నిర్దేశించిన లక్ష్యం రూ.2 వేల 289 కోట్లుకాగా ఇప్పటివరకు రూ.1268 కోట్లు అందించారని తెలిపారు. పీఎం స్వ నిధి, పీఎం విశ్వకర్మ, ముద్ర, స్టాండ్ అప్ ఇండియా పథకాల క్రింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులలో అర్హులైన లబ్దిదారులకు రుణాలు ఇవ్వాలన్నారు. జిల్లాలోని 6, 592 స్వయం సహాయక సంఘాలకు రూ.221 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 2,870 సంఘాలకు రూ.160 కోట్లు అందిచారని, మిగతా లక్ష్యాన్ని త్వరగా పూర్తిచేయాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్, ట్రై కార్ ద్వారా అందించే రుణాలను త్వరగా పూర్తి చేయాలని, పీఎంఈజీపీ కింద మంజూరైన రుణాలు అందించేందుకు అధికారులు పర్యవేక్షించాలని, బ్యాంకర్లు చిన్న పరిశ్రములు స్థాపించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ అర్హత గల వారికి రుణ సదుపాయం కల్పించాలన్నారు. మహిళా సంఘాలకు అందించిన రుణాలలో రికవరీ త్వరగా పూర్తిచేసి తిరిగి రుణాలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం క్రెడిట్ ప్లాన్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రాజేశ్వర్ జోషి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, డీపీఎం, ఏపీఎం, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

నీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

నవతెలంగాణ-దహెగాం

వేసవి ప్రారంభం కాకముందే ప్రజలకు నీటి కష్టాలు మొదలయ్యాయి. తాగు నీటిని అందించాలని మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీవాసులు ఖాళీ బిందెలతో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైటాయించారు. 15 రోజుల నుండి నీళ్లకు ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కలకృత్యాలతో పాటు తాగడానికి కూడా నీరు దొరకడం లేదన్నారు. మండల కేంద్రంలో నివాసం ఉంటే తమకే ఈ పరిస్థితి ఉంటే మారుమూల గ్రామాల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని చెబుతున్నారు. మిషన్ భగీరథ నీరు రాక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు తెలియజేసిన ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. అధికారులు కాలనీల్లో రారని, సమస్యలు తెలుసుకోరని చెప్పారు. అధికారుల తీరుకు నిరసనగా ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టాల్సి వచ్చిందన్నారు. తాగు నీటిని అందించేల చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరామించారు.



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో బైటాయించిన మహిళలు

సీఐటీయూ నిరంతర పోరాట ఫలితమే జీఓ



సీఐటీయూ నాయకులకు స్వీట్లు తినిపిస్తున్న నర్సరీ కార్మికులు

నవతెలంగాణ-రెబ్బెన

సీఐటీయూ నిరంతర పోరాట ఫలితమే కనీస వేతన జీఓ అమలు అవుతుందని సీఐటీయూ బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. బెల్లంపల్లి ఏరియా గోలేటిలో సింగరేణి నర్సరీ కాంట్రాక్టు కార్మికుల సంఘం నర్సరీ కార్మికులకు కనీస వేతన జీఓ అమలు చేయడంతో స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ కార్మికులు 6, 7 సంవత్సరాల నిరంతర పోరాట ఫలితమే జీఓ అమలైందన్నారు. అంతే కాకుండా 28 రోజుల పాటు నర్సరీ కార్మికులు సమ్మెలోకి వెళ్తే సమ్మె కాలంలో కూడా మీకు ఏమి రాదని ఎందుకు సమ్మెలో పాల్గొన్నారని హేళన చేసిన నాయకత్వమే ఈ రోజు మా పోరాటం వల్లే వచ్చిందని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. నర్సరీ కార్మికులు అన్నిటికి తెగించి, నిలబడి పోరాడి సాధించుకున్న హక్కు అని అన్నారు. కార్యక్రమంలో గోలేటి నర్సరీ కార్మికులు రాపెల్లి శారదా, దుర్గం చిన్నుబాయి, వదాస్కర్ వనిత, వెయ్యిగన్ల స్రవంతి, పొట్లపెల్లి సాలక్కా, సల్లూరి లక్ష్మీ, దొంగ్రి మీరాబాయి, దుర్గం లక్ష్మీ, దుర్గం కమలాబాయి, జిత్యవేణి ఎల్లతి లక్ష్మీ, కేశవేణి నాగమ్మ, బింగి విజయలక్ష్మీ పాల్గొన్నారు.

తెలంగాణ బొగ్గు కార్మిక సంఘం ఆధ్వర్యంలో..

నర్సరీ కార్మికులు అలుపెరుగకుండా ఐక్యంగా అనేక పోరాటాలు చేసిన ఫలితంగా కనీస వేతనాల జీఓ విడుదల కావటం గొప్ప విజయమని తెలంగాణ బొగ్గు గనుల కాంట్రాక్టు కార్మికుల సంఘం బెల్లంపల్లి ఏరియా అధ్యక్షులు అంబాల ఓదెలు అన్నారు. గురువారం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌కేవీతో పాటు అన్ని సంఘాలు ఐక్యంగా పోరాడిన సీఐటీయూ పాత్ర మరువలేనిదని, సీఐటీయూ ప్రధాన భూమిక పోషించి నర్సరీ కార్మికులకు కనీస వేతనాల జీఓ రావడానికి కృషి చేసారని తెలిపారు. కార్యక్రమంలో నర్సరీ కార్మికులు చిన్నూబాయ్, రాంపల్లి శారద, శ్రవంత, అనిత, బింగి లక్ష్మి, సాలమ్మా పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో అదనపు లాభాలు : జిల్లా జడ్జి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారంతో కక్షిదారులకు అదనపు లాభాలు కలుగుతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి ఎంవీ రమేష్ అన్నారు. మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను పురస్కరించుకొని పోలీస్ అధికారులు, అడ్వకేట్లతో సీనియర్ సివిల్ జడ్జి యువరాజు, జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మితో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 8న నిర్వహించే లోక్ అదాలత్ ఈ సంవత్సరంలో మొట్టమొదన్నారు. 5000 కేసుల పరిష్కారం లక్ష్యంగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌తో కక్షిదారులకు లాభాలు కలుగుతాయన్నారు. గ్రామాల్లో పంచాయతీలతో పరిష్కరించుకునే సమస్యలకు ఎటువంటి చట్టబద్ధత ఉండదని, గడువుకాలం, బైండింగ్ చేసే అవకాశం ఉండదని లోక్ అదాలత్‌తో అవన్నీ కలిగే అవకాశం ఉంటుందన్నారు. క్రిమినల్ కేసులను కూడా కాంపౌండ్ చేయడానికి అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదవారికి న్యాయ సహాయం అందించడానికి ప్రత్యేకంగా జిల్లా కోర్టుతో పాటు సీనియర్ సివిల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులలో ఒక్కొక్కరిని అడ్వకేట్లుగా నియమించిందని పేద ప్రజలు దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనికోసం జాతీయ లీగల్ సర్వీస్ అథారిటీ టోల్ ఫ్రీ నెంబర్ 15100కు కూడా ఫోన్ చేయవచ్చని తెలిపారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం దిశగా పోలీసులు అడ్వకేట్లు కృషి చేయడంతో పాటు ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 24 నుండి ముందస్తు లోక్ అదాలత్‌లో భాగంగా ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మార్చి 8 వరకు కేసుల పరిష్కారం చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ పోలీస్ అధికారులు, అడ్వకేట్లు పాల్గొన్నారు.



పోలీసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్నజిల్లా జడ్జి ఎంవీ.రమేష్

గడ్డి మందు తాగి వృద్ధురాలి మృతి

నవతెలంగాణ-తిర్యాణి



మానసిక స్థితి బాగాలేక గడ్డి మందు తాగి వృద్ధురాలు మృతిచెందిన సంఘం మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఎంబడి శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగు రోజుల క్రితం మండలంలోని గోయగాం గ్రామానికి చెందినన అంకతి రాజక్క(53) వృద్ధురాలు పురుగుల మందు తాగి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. బుధవారం రాత్రి మృతి చెందినట్టు తెలిపారు. రాజక్క తన మనవరాలికి వివాహం కుదరడంతో గత నెల 14న తన కూతురు కుటుంబసభ్యులతో కలిసి మంచిర్యాలలో బట్టలు కొనుగోలు చేయడానికి వెళ్లి అదే రోజు రాత్రి తిరిగి ఇంటికి వచ్చింది. ఇంటికొచ్చిన సమయంలో ఇంట్లో అన్నం లేకపోవడంతో తన భర్త రాజయ్యతో గొడవపడి అలాగే పడుకుంది. మరుసటి రోజు ఉదయం రాజక్క పడుకున్న మంచం దగ్గర పురుగుల మందు డబ్బా కనిపించడంతో భర్త రాజయ్య కుటుంబ సభ్యులకు చెప్పడంతో కుటుంబసభ్యులు ఆమెను నిద్రలేపి మందు తాగావానని ప్రశ్నించారు. ఆమె తాగలేదని సమాధానం చెప్పడంతో నమ్మకం లేక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పురుగుల మందు తాగిందని తెలపడంతో మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆస్పత్రికి అక్కడి నుండి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. గతంలో రాజక్కకు రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయం కావడంతో అప్పటి నుండి మానసిక స్థితి బాగాలేదని, ప్రతి చిన్న విషయానికి గొడవ పడుతుండేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి కోడలు అంకతి అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

విద్యపై దృష్టి సారించాలి : ఐటీడీఏ పీఓ

- రాంజీగూడ ఆశ్రమ పాఠశాల తనిఖీ



నవతెలంగాణ-కెరమెరి

విద్యపై దృష్టి సారించాలని ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా విద్యార్థులకు సూచించారు. గురువారం మండలంలోని రాంజీగూడ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పోకెన్ ఇంగ్లీష్ ప్రోగ్రాంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ రానున్న పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయుల బోధనపై ఆరా తీశారు. విద్యార్థులతో ముచ్చటించి వారి సామర్థ్యాలను పరిశీలించారు. 8వ తరగతి విద్యార్థులు ఇంగ్లీష్ మాట్లాడడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇంగ్లీష్ మాట్లాడడం చూసి సంతోషంగా ఉందన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్ ప్రోగ్రాం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు సురక్షితమైన నీటిని తాగాలని సూచించారు. బోర్‌వెల్ నీరు తాగడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని విద్యార్థులకు తెలిపారు. అదేవిధంగా పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేందాస్, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

55 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే



నవతెలంగాణ-తిర్యాణి

ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోనే 55 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని టీపీసీసీ సెక్రెటరీ రవళిరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం మండలంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రభుత్వం సంవత్సరంలోపే అనేక ఉద్యోగాలు, నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగాన్ని రూపుమాపి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేశామని గుర్తు చేవారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్‌నాయక్ మాట్లాడుతూ నిరుద్యోగుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నం చేస్తూనే ఉంటుందన్నారు. నిరుద్యోగాన్ని రూపుమాపే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు చేపడుతున్నారన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు బొల్లం వెంకన్న, అంకం గౌరయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాంచందర్ టీపీసీసీ సెక్రెటరీ, నియోజకవర్గ ఇన్‌చార్జిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మేర చందు, బొల్లం మల్లేష్, చేదం కుమార్, బొల్లం దినేష్, బోర్లకుంట మహేష్, మేడిశెట్టి అంజయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



బీజేపీ బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నాయకులు కోరారు. మండలంలోని చేద్వాయి, పోతేపల్లి, గొంట్లపేట గ్రామాల్లో తిరుగుతూ పట్టభద్రులకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కుకీదే రాజేష్, మాజీ అధ్యక్షులు జునుగారి మధుకర్, పట్టభద్రుల మండల కన్వీనర్ బోయిరె నానయ్య, మహేష్, పంబాల అంకులు, బండి ప్రభాకర్ పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మణ్ రావు అధ్యక్షతన సుందిల్ల రమేష్ పాల్గొని విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడుతున్న సందర్భంగా వారి యొక్క మానసిక స్థితి, ఒత్తిడిని జయించడానికి పలు సూచనలు చేశారు. అలాగే పరీక్షలకు సిద్ధమయ్యే సమయంలో తీసుకోవల్సిన గ్రత్తలు, చిట్కాలు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బుర్ర అశోక గౌడ్, అరవింద్, చిన్నయ్య శ్రీనివాస్ రావు, హేమ చంద్రర, మహేందర్, రాంప్రసాద్, తిరుపతి, సజన, రమ్య విద్యార్థులు పాల్గొన్నారు.

దర్శనానికి వేర్వేరు మార్గాల ఏర్పాటు

నవతెలంగాణ-జైపూర్



వేలాల జాతర సందర్భంగా గట్టుమల్లన్న దర్శనార్థం తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం కాలినడక, వాహనాల్లో వెళ్లే వారికి వేరువేరుగా మార్గాలను ఏర్పాటు చేసినట్లు ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, జైపూర్ ఎస్సై శ్రీధర్‌తో కలిసి గురువారం రోడ్డు మార్గాలను పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేరువేరు మార్గాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆలయానికి దగ్గరగా ఆర్టీసీ బస్టాండ్, వీఐపీ వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశామన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా తాగు నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.

కలిసికట్టుగా పనిచేసి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకోవాలి

- రాష్ట్ర మంత్రి సీతక్క
- కుల గణన సమస్యలతో స్థానిక ఎన్నికలు వాయిదా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-జన్నారం

నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పైడిపల్లి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఎమ్మెల్సీ సన్నాక ప్రచార సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. రూ.500కే సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. రైతులకు రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులాల మతాల మధ్యలో చిచ్చు పెట్టడమే తప్ప అభివృద్ధి చేయడం లేదన్నారు. కుల గణన చేస్తే అది తప్పుడు తడకలుగా ఉందని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వమే కదా కుల గణన జనాభా గణన దేశమంతటా చేయొచ్చు కదా, అది చేతగాక చేసిన తెలంగాణ ప్రభుత్వాన్ని విమర్శించడం తగదన్నారు. కుల గణనలో పలు సమస్యలు ఏర్పడడంతో ఇప్పటికే జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 54 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తు చేశారు. పట్టభద్రులు నిరుద్యోగుల తరపున పోరాటం చేయాలన్న, తమ హక్కులను సాధించుకోవాలన్న ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ముందుగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలన్నారు. టైగర్ జోన్ సమస్యపై మంత్రి సీతక్క దృష్టికి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, రాష్ట్ర జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మాణిక్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, సుభాష్ రెడ్డి, మోహన్ రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్, మామిడిపల్లి ఇందయ్య, దుమల రమేష్, కరుణాకర్, సోహెల్ ఇసాక్, బండారి స్వామి, మచ్చ శంకరయ్య, మహమ్మద్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

టైగర్ జోన్ ఆంక్షలు పేరుతో ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకోం

అటవీ ఆంక్షలతో ప్రజలను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని రాష్ట్ర మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ సన్నాక సమావేశానంతరం మీడియాతో మాట్లాడారు. అటవీ ఆంక్షలు, అధికారుల అత్యుత్సాహంపై తాను అటవీ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడతానని తెలిపారు. కొంతమంది అధికారులు ప్రజలపై దౌర్జన్యం చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అమాయకమైన పేద ప్రజలుంటారని ఇక్కడ ప్రభుత్వ అటవీ శాఖలో పని చేయాలంటే ఎంతో ఓర్పు ఉండాలన్నారు. కానీ కొంతమంది అటవీ అధికారులు ఇక్కడి ప్రజలపై దురుసుగా ప్రవర్తిస్తూ ప్రజలను ఆంక్షల పేరుతో దుర్భాషలాడుతున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. పది సంవత్సరాల కాలంలో ఇక్కడ అటవీ ఆంక్షలు లేవా అని ప్రశ్నించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయినప్పటికీ కావాలని కొంతమంది అటవీ అధికారులు ప్రజలను చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి అధికారులు ఉంటే గత ప్రభుత్వంలో పని చేసిన నాయకుల ఇండ్లలోకి వెళ్లి ఊడిగం చేసుకోవాలి కానీ ఇలా ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉండి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువస్తే సహించేది లేదని హెచ్చరించారు. కలప అక్రమ స్మగ్లింగ్ చర్యల పేరుతో ప్రజా రవాణను అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. అధికారులు హద్దులో ఉండాలన్నారు.

చెరువు మట్టి తరలిస్తున్న యంత్రాల సీజ్



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని రేచిని గ్రామ శివారులోని ప్రభుత్వ చెరువు నుంచి అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్న జేసీబీ, 5 ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకుని సీజ్ చేసినట్లు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఏజాజుద్దీన్ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్ చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జేసీబీతో పాటు 5 ట్రాక్టర్లను సీజ్ చేసి తాండూర్ పోలీస్ స్టేషన్ తరలించారు.

బాల బాలికల జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక



నవతెలంగాణ-నస్పూర్

అండర్-16 బాలబాలికల జిల్లా కబడ్డీ జట్టును ఎంపిక చేశామని తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఈసీ మెంబర్ కొంద్ర కార్తీక్, వైస్ ప్రెసిడెంట్ రాంచందర్ తెలిపారు. మంచిర్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న జిల్లా జట్టును ఎంపిక చేసి ఎంపికైన క్రీడాకారులకు ప్రాణహిత స్టేడియం నాగార్జున కాలనీలో వారం రోజులపాటు శిక్షణనిచ్చారు. ఫిబ్రవరి 20 నుంచి 23 వరకు వికారాబాద్‌లో నిర్వహించే 34వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మంచిర్యాల జిల్లా జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. జిల్లా జట్టు ఎంపికైన బాలురులో ఆదిత్య సందీప్, రాగువర్ధన్, మనోజ్, విక్సిత్, చరణ్, సాయి రిసిత్, మల్లికార్జున్, రిషి కుమార్, సాయి రణధీర్, ఉదయ్ కుమార్, శివ ఆర్లిక్, కోచ్ శివ, మేనేజర్ కే.సంజయ్, బాలికల జట్టులో శ్రీజ, రక్షిత, మనోజ్ఞ, వేదన, చంద్ర స్మిత, ఆశ్రిత, శృతి, సంగీత రాణి, హారిక, శాశ్వత, యోగిత, నిరీక్ష, ఉషా రాణి, క్రాంతికేయ, కోచ్ ఆకాంక్ష ఉన్నారు.

పరుగులు తీస్తే ప్రమాదం మీవెంటే...!



నవతెలంగాణ-జైపూర్

కుందారం-కిష్టాపూర్ ప్రధాన రహదారిలో వాహనాలను పరుగెత్తిస్తే ప్రమాదం మీ వెంట ఉన్నట్లే.. ఈ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్న వాహనాలకు పెద్దవాగు కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టు పొడవు గుంతలు ఏర్పడటంతో వాహనాదారులు అతి జాగ్రత్తగా నడుపాల్సివస్తుంది. వాహణాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డాంలో గల గుంతలను గత కొంత కాలంగా పూడ్చకుండా నిర్లక్ష్యం చేస్తుండటం సమస్యలకు దారి తీస్తుందని వాహన చోదకులు వాపోతున్నారు. వేలాల జాతర సమీపిస్తున్నందున వాహనాల రాకపోకల రద్దీ విపరీతంగా ఉంటుంది. రోడ్డు పొడవు పరుగులు తీసిన వాహనాలకు పెద్దవాగు కల్వర్టు వద్ద బ్రేకులు పడాల్సిందే. కొత్తవారు ఈ రోడ్డు మీదుగా రాత్రి పూట ప్రయాణిస్తే ప్రమాదంలో చిక్కుకోవాల్సిన పరిస్థితులను అధికారులు గుర్తించాలని కోరుతున్నారు. గుంతలమయమైన కల్వర్టును పూడ్చి రాకపోకలు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి



రైల్వే అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-తాండూర్

రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలివ్వాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రామాచారి డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ అనుబంధ తెలంగాణ రైల్వే క్యాజువల్, కాంట్రాక్టు, ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి రైల్వే ఎస్ఎస్ఈ సీఅండ్‌డబ్ల్యుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా అధ్యక్షులుదుంపల రంజిత్ కుమార్‌తో కలిసి మాట్లాడుతూ బెల్లంపల్లి రైల్వే సీఅండ్‌డబ్ల్యు డిపార్ట్‌మెంట్‌లో శ్రీ బాలాజీ ఇంజనీరింగ్ ఎంటర్‌ప్రైజస్ ద్వారా దాదాపు 60 మంది కాంట్రాక్టు కార్మికులు వెల్డర్స్, హెల్పర్స్‌గా పని చేస్తున్నారనీ తెలిపారు. వీరికి జీఓ ప్రకారం కనీస వేతనాలు అమలు కావడం లేదని, 2024 సెప్టెంబర్ 25న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం అక్టోబర్ 1 నుండి అమలు కావాల్సిన స్కిల్డ్ వేతనాలు రోజుకి రూ.739 చెల్లించాల్సి ఉండగా రూ.620 నుండి రూ.680 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. అన్ స్కిల్డ్ కార్మికులకు రోజుకు రూ.526 చెల్లించాల్సి ఉండగా రూ.320 నుండి రూ.450 చెల్లిస్తున్నారన్నారు. 30 రోజులు పని చేస్తే వారాంతపు సెలవులు ఇవ్వకుండా 26 రోజుల వేతనం చెల్లిస్తున్నారన్నారు. సూపర్‌వైజర్ బ్యాంకు ఖాతాలో వేతనం జమ చేసి మొత్తం నుండి రూ.2 వేల చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. డబ్బులు ఇవ్వని కార్మికున్ని పనిలోకి తీసుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. పీఎఫ్ ఈఎస్ఐ వివరాలను కార్మికులకు తెలియజేయడం లేదన్నారు. సమస్యల పరిష్కరంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్రంగా ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ బెల్లంపల్లి మండల కన్వీనర్ చల్లూరి దేవదాస్, జెట్టి సురేష్, బొల్లె విశ్వనాథ్, రైల్వే యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు దూలం శ్రీనివాస్, సాగర్, రాజు కుమార్, శ్రీనివాస్, శ్రీహరి, అనిల్ కమల్ హాసన్, రోహిత్, శివశంకర్, సయ్యఫ్ పాల్గొన్నారు.

ఘనంగా గోవింద్ పన్సారే వర్ధంతి



నవతెలంగాణ-నస్పూర్

మతోన్మాదుల చేతిలో హత్యకు గురైన గోవింద్ పన్సారే 10వ వర్ధంతిని నస్పూర్ పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల సహాయ కార్యదర్శి మొగిలి లక్ష్మణ్ మాట్లాడుతూ గోవింద్ పన్సారి హేతువాది కమ్యూనిస్టు నాయకుడని, మూఢనమ్మకాల నిర్మూలన కోసం ఊరూరా తిరుగుతూ ప్రచారం చేశాడన్నారు. పన్సారే 21 పుస్తకాలు రాశాడని, ఛత్రపతి శివాజీని ముస్లింలు చంపినారని తప్పుడు ప్రచారం చేస్తే చరిత్ర ఆధారాలతో శివాజీ కౌన్ హతా పుస్తకం రాసిన రచయిత, హేతువాద ప్రచారకర్త, కార్మిక నాయకుడు గోవింద్ పన్సారేను ఆర్ఎస్ఎస్ మతోన్మాద గుండాలు 2015 ఫిబ్రవరి 16న కాల్పులు జరిపి పారిపోయారన్నారు. చికిత్సపొందుతూ ఫిబ్రవరి 20న ఆస్పత్రిలో మరణించారని తెలపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గునిగంటి, నరసింగరావు, హరీష్, పాదం శ్రీధర్, చల్లూరి కిష్టయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-తాండూర్



ఎండాకాలం దృష్ట్యా నర్సరీ మొక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. గురువారం తాండూర్ గ్రామపంచాయతీ నర్సరీ మొక్కల ఎదుగుదలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా నర్సరీ మొక్కలకు రెండు పూటలా నీరు అందించాలన్నారు. నర్సరీ బెడ్లలో ఎప్పటికప్పుడు కలుపును తీసివేయాలన్నారు. మొలకలు రానీ బ్యాగులలో తిరిగి విత్తనాలను నాటాలన్నారు. ఎండల తీవ్రత పెరిగినందున నర్సరీల్లో షెడ్ నెట్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండలంలో 15 గ్రామ పంచాయతీలకు గాను 1,70,000 పండ్లు, పూలు, వృక్షజాతి మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. నర్సరీల్లో 83శాతం మొలక శాతం వచ్చిందని వివరించారు. ఆయన వెంట తాండూర్ పంచాయతీ కార్యదర్శి దివాకర్ ఉన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-మంచిర్యాల



అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ కుమార్ దీపక్

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడలో చేపట్టిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, ఐబీ చౌరస్తాలో కొనసాగుతున్న ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవన నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు మరింత వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది సంఖ్య మెరుగుపరిచే ఆలోచనతో ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలలతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తుందన్నారు. ఈ క్రమంలో జిల్లాలో చేపట్టిన నిర్మాణ అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందని, 225 పడకలతో మాత శిశు, 425 పడకలతో ప్రభుత్వ ఆస్పత్రి కలిపి నిర్మించడం జరుగుతుందనని తెలిపారు. నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం కోసం ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా ఇక్కడే పూర్తి స్థాయిలో అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి ప్రజాపాలన సేవా కేంద్రాలు, కార్యాలయ రిజిస్టర్లు పరిశీలించారు.

అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

ఐఎన్టీయూసీ నాయకులు జనక్ ప్రసాద్ అవగాహన రాహిత్యంతో అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని ఏబీకేఎంఎస్(బీఎంఎస్) కార్యదర్శి మాధవ్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఎంఎస్ నాయకులు లక్ష్మారెడ్డిపై నిరాధార ఆరోపణలు చేసినందుకు క్షమాపణ చెప్పాలన్నారు. రూ.1390 కోట్లను సీఎంపీఎఫ్ డిహెచ్ఎఫ్ఎల్‌లో పెట్టుబడి పెట్టగా ఆ సంస్థ దివాలా తీసుకోవడంతో రూ. 727 కోట్లు సీఎంపీఎఫ్ ఖాతాకు తిరిగి రాలేదన్నారు. ఈ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు జరిపి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించి, ఆ నిధులను సీఎంపీఎఫ్‌కు తిరిగి జమ చేసేలా చర్యలు తీసుకోవాలని మాత్రమే లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారని, డీహెచ్ఎఫ్ఎల్ సంస్థ యాజమాన్యం లేదా బినామీల గురించి ఎక్కడా ఆరోపించలేదని జనక్ ప్రసాద్ గమనించాలన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా అవగాహన రాహిత్యంగా మాట్లాడటం ఆయనకు తగదన్నారు.

నేటి నుండి పత్తి కొనుగోలు

నవతెలంగాణ-తాండూర్

వ్యవసాయ మార్కెట్ కమిటీ బెల్లంపల్లి పరిధిలోని 02 జిన్నింగ్ మిల్లులలో శుక్రవారం నుండి పత్తి కొనుగోలు యధాతథంగా నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు నాణ్యమైన పత్తిని అమ్మకానికి తీసుకురావాలని, వేలిముద్రల గుర్తింపు ద్వారా పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. సంబంధిత రైతు తప్పకుండా కొనుగోలు కేంద్రానికి రావాల్సి ఉంటుందన్నారు.

త్వరలోనే దివ్యాంగులకు ఉపకరణాలు

- డీడబ్ల్యూఓ రౌఫ్ ఖాన్



దరఖాస్తులు స్వీకరిస్తున్న డీడబ్ల్యూఓ, మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-లక్షెట్టిపేట

జిల్లా సహకార సంస్థ, ఆలింకో సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో త్వరలోనే దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తామని జిల్లా సంక్షేమ అధికారి(డీడబ్ల్యూఓ) రౌఫ్ ఖాన్ తెలిపారు. అర్హులైన దివ్యాంగులకు పరికార కోసం రైతు వేదికలో క్యాంప్ నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శారీరక దివ్యాంగులకు, బ్యాటరీ ఆపరేటర్ ట్రై సైకిల్, చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్స్, మూడు చక్రాల సైకిల్లు, చెవిటి, మూగ దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, అంధ దివ్యాంగులకు స్మార్ట్ కేన్, అందుల చేతి కర్ర, అంధ విద్యార్థులకు స్మార్ట్ ఫోన్స్, మానసిక దివ్యాంగులకు ఎంఎస్ఐఈడీ కిట్ లేదా ఎంఆర్ కిట్, బ్యాటరీ ఆపరేటర్ ట్రై సైకిల్ అందిస్తామన్నారు. దీనికి 80శాతం శారీరక వికలాంగత్వం (చేతులు బాగుండి కాళ్ల వికలాంగత్వం కలిగి ఉన్న దివ్యాంగులకు మాత్రమే) మిగిలినవి 40శాతం శారీరక అంగవైకల్యం కలిగిన వారికి ఉపకరణాలు, సహాయక ఉపకరణాలు అందించేందుకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. సదరం సర్టిఫికెట్ లేని వారు ఫిజీషియన్ ధ్రువీకరించిన పత్రం, యూడీఐడీ, రేషన్, ఆహార భద్రత కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ తదితర పత్రాలతో దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. మూడు మండలాల నుంచి దాదాపుగా 440పైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ మందరేష్మ, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు, అధికారులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో ఫ్యామిలీ బ్లూమ్ కార్యక్రమం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో సెల్ఫ్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఫ్యామిలీ బ్లూమ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల తల్లితండ్రులను ఆహ్వానించి పిల్లలను ఆశీర్వదించారు. దీంతో తల్లిదండ్రులను గౌరవంతో పాదాభిషేకం చేసి వందనాలు చేయించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.అశ్విని విద్యార్థులకు కుటుంబ విలువల, వారితో భవిష్యత్తులో నడుచుకోవాల్సిన విధానాల గూర్చి వివరించారు. వేడుకను ఘనంగా నిర్వహించడంతో పాఠశాలల ఛైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ వీ.శ్రీనివాస్, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి శిరీష, ప్రైమరీ ఇన్‌చార్జి శైలజ, ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

శుక్రవారం | ఫిబ్రవరి 21, 2025 | www.navatelangana.com

బాలాజీ ఆలయంలో చోరీ

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని గంగాపూర్ గ్రామంలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో దొంగతనం జరిగింది. బుధవారం రాత్రి వెనక నుంచి వచ్చి ఆలయంలోని హుండీలో ఉన్న సొత్తును ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఆలయానికి పూజరి దొంగతనం జరిగినట్టు తెలుసుకొని ఆలయకమిటీతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా దొంగతనం జరుగుతున్నాయని భక్తులు ప్రజలు అంటున్నారు. ఆలయ ఈఓ బాపిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. సీసీ కెమెరా ఫుటేజ్ తీసుకోవడం జరిగిందని, త్వరలోనే దొంగను పట్టుకుంటామని తెలిపారు.

టాలెంట్ టెస్ట్ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ - హాజీపూర్



యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్ విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టపల్లి తిరుపతి, మల్లేశ్ కోరారు. మార్చి 2,3,4,5 తేదీల్లో నిర్వహించనున్న టాలెంట్ టెస్ట్ ప్రచార పోస్టర్లను గురువారం ఎస్సై సురేశ్ ఆవిష్కరించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు టాలెంట్ టెస్ట్ ఎంతో దోహదపడుతుందని సంఘం నాయకులు పేర్కొన్నారు.

వృత్తి శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-తాండూర్

సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తి శిక్షణ కోర్సులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు ఉమారాణి శ్రీనివాస్ అన్నారు. గురువారం మాదారం టౌన్‌షిప్‌లోని సేవాసమితి కార్యాలయ ఆవరణలో బ్యూటీషియన్, కుట్టుమిషన్, ఎంబ్రాయిడింగ్, యోగా తదితర కోర్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తి శిక్షణ కేంద్రాల నైపుణ్యతతో స్వయం ఉపాధి పొందాలని సూచించారు. కుటుంబ ఆర్థిక అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు వృత్తి శిక్షణ స్వయం ఉపాధి మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. ముఖ్యంగా నిరుద్యోగులైన వృత్తి శిక్షణలో రాణించాలని సూచించారు. పురుషులతో పాటు సంపాదించే స్త్రీలకు సమాజంలో గుర్తింపు ఉంటుందని తెలిపారు. స్వయం ఉపాధి మార్గాల ద్వారా కుటుంబ పోషణలో భాగస్వాములు కావాలని కోరారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టౌన్‌షిప్‌లోని మహిళలు, శిక్షకులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి



నవతెలంగాణ-వాంకిడి

పదవ తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ముందుగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఎలాంటి సమస్యలున్నా 1098కు ఫోన్ చేయాలన్నారు. అధైర్యపడొద్దని, సమస్యను అధికారాల దృష్టికి తీసువస్తే పరిష్కరిస్తామన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున క్రమశిక్షణతో చదువుకొని ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి మంచిమార్కులు సంపాదించాలని, అందుకు ప్రణాళిక బద్ధంగా ప్రతిరోజు సాధన చేయాలని సూచించారు. పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతిరోజు పిల్లలకు వేడి భోజనాన్ని అందించి ఆరోగ్యంగా ఉండేలా చూడాలని, నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నారాయణమూర్తి, కౌన్సిలర్ చంద్రశేఖర్, చైల్డ్ హెల్ప్‌లైన్ డిస్టిక్ కోఆర్డినేటర్ బాల ప్రవీణ్, కేస్ వర్కర్ వెంకటేశ్వర్లు, పీతాంబర్ పాల్గొన్నారు.

అధికారికి ఘన సన్మానం



నవతెలంగాణ-జైపూర్

ఈ నెల 28న ఉద్యోగ విరమణ పొందుతున్న ఎస్టీపీపీ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) రవి ప్రసాద్‌ను ఎస్టీపీపీ ఈడీ సహా అధికారులు ఘనంగా సన్మానించారు. ఎస్టీపీపీ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం జరిగిన ఈ సన్మాన సభలో ఈడీ ఎన్వీ రాజశేఖర్‌రావు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందతున్న రవి ప్రసాద్ మార్కెటింగ్‌లో సంస్థకు అమూల్యమైన సేవలు అందించారని తెలిపారు. సంస్థ అభివృద్ధికి చేసిన కృషి మరువరానిదని పేర్కొన్నారు. రవి ప్రసాద్ మాట్లాడుతూ సింగరేణితో తనకు ఎంతో అనుబంధం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శ్రీనివాసులు, చీఫ్ ఆఫ్ ఓఅండ్ఎం జేఎన్ సింగ్ సత్యనారాయణ ప్రసాద్, హరప్రసాద్, అజ్మీరా తుకారాం పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

24న నిర్వహించనున్న సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ జయంతి ఉత్సవ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు ఏంపల్లి తదితర తండాల్లో జయంతి ప్రచారం నిర్వహించారు. సమాజ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలనీ కోరారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ ఆడే, బంజారా నాయకులు డిగంబర్ ఆడే, యశ్వంత్‌రావ్ చవాన్, వసంత్ ఆడే, సికిందర్ రాథోడ్, ప్యాక్స్ డైరెక్టర్ జాదవ్ కైలాస్, దిలీప్ రాథోడ్, చవాన్ ప్రకాష్, మాజీ సర్పంచ్ విష్ణు, గోవింద్ పాల్గొన్నారు.

మహిళా సాధికారత వారోత్సవాలు

నవతెలంగాణ-నిర్మల్

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యత, మహిళా సాధికారతపై ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆర్థిక ప్రణాళిక, పొదుపు నష్ట నివారణ చర్యలు, ఆర్థిక పరిపుష్టికి రుణాలు పొందడం, గృహ రుణాలు, ఉద్యోగినులకు, స్వయం ఉపాధి పొందాలనే మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాలు, ట్రాన్స్ ఉమెన్, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యాంపులు ఉంటాయని తెలిపారు. ఫిబ్రవరి 25న జిల్లా కేంద్రంలో 2కే రన్ నిర్వహించడం జరుగుతుందని, ఇందులో మహిళా సంఘాలతో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సమన్వయంతో నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.

పత్తి రైతులు ఆందోళన చెందొద్దు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో పత్తి కొనుగోలు పూర్తి అయ్యే వరకు ప్రక్రియ కొనసాగుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల సంక్షేమం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఈ క్రమంలో జిల్లాలో పత్తి కొనుగోలు ప్రక్రియ ముగిసే వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. ఆధార్ వెరిఫికేషన్‌లో ఓటిపి ప్రక్రియలో సర్వర్ డౌన్ ఉన్న కారణంగా పత్తి కొనుగోలు నిలిపివేయడం జరిగిందని, ప్రస్తుతం సర్వర్ రిస్టోర్ ప్లానింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం ప్రకారం రైతుల నుండి పత్తి కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకుండా రైతుల నుండి టోకెన్ పద్ధతిన పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు సహకరించాలని తెలిపారు. ప్రభుత్వం కనీస మద్దతు ధరతో రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని, తేమ శాతం నిబంధనలకు లోబడి ఉండేలా రైతులు చూసుకోవాలని తెలిపారు.




అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

లేఅవుట్ ప్లాట్ల క్రమబద్దీకరణ కొరకు ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్-2020లో వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో పట్టణ ప్రణాళిక, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను ఫిబ్రవరి 28లోగా పూర్తి చేసే విధంగా అధికారులు పనులను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని 7మున్సిపాలిటీలలో 39,512 దరఖాస్తులు రాగా 9,500 నిషేధిత భూములుగా గుర్తించడం జరిగిందని, ప్రాథమిక స్థాయిలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ పరిధిలో 7,444 దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. 2వ స్థాయిలో పట్టణ ప్రణాళిక విభాగం పరిధిలో 3,790 దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. 3.745 ఆమోదించబడగా 130 మంది లబ్దిదారులు రుసుము చెల్లించడం జరిగిందని, 3,615 మంది చెల్లించవలసి ఉందని తెలిపారు. మాసాంతంలోగా ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇండ్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో దగ్ధమవుతున్న ఇండ్లు

నవతెలంగాణ-పెంబి

మండలంలోని రాయదారి గ్రామంలో గురువారం షార్ట్‌సర్క్యూట్‌తో పది ఇండ్లు దగ్ధమయ్యాయి. మంటలను ఆర్పేందుకు గ్రామస్తులు ప్రయత్నించిన అదుపులోకి రాకపోవడంతో ఫైర్ సిబ్బందికి ఫోన్ చేయడంతో రెండు ఫైర్ ఇంజన్‌లు వచ్చి మంటలార్పారు. అగ్నిప్రమాదం జరిగిన ఇంటి సమీపంలోని వారు భయభ్రాంతులకు గురయ్యారు. ఆస్తి నష్టం ఎంత జరిగిందన్నది అంచనా వేయలేదని అధికారులు తెలిపారు. కాగా బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

నిర్మల్ : అగ్ని ప్రమాద బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం పెంబి మండలం రాయదారిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో 6 నివాస గృహాలకు అగ్ని ప్రమాదం జరిగిందని తెలిపారు. ప్రమాద బాధితులకు భోజనం, రాత్రి బస ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటన సంబంధించి పూర్తి వివరాలు ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని, బాధితులకు ఆర్థిక సాయం, పునరావాసం, నూతన ఇండ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధితులు ఆందోళన చెందవద్దని, అందరం అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్మెంట్ ముఖ్యమైంది



సమావేశంలో మాట్లాడుతున్న ఈడీ ఎన్వీ రాజశేఖర్‌రావు

- ఎస్టీపీపీ ఈడీ ఎన్వీ.రాజశేఖర్‌రావు

నవతెలంగాణ-జైపూర్

కార్యాలయాల్లో పనులు సులభతరంగా పూర్తి చేసుకునుటకు సాప్ సాఫ్ట్ వేర్‌లో ఎఫ్ఎల్ఎం(ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్మెంట్) చాలా ముఖ్యమైందని ఎస్టీపీపీ ఈడీ ఎన్వీ.రాజశేఖర్ అన్నారు. ఎస్టీపీపీ ప్రాణహిత గెస్ట్ హౌజ్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం ఎస్టీపీపీ ఉద్యోగులకు ఏర్పాటు చేసిన సాప్-ఎఫ్ఎల్ఎంపై అవగాహ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ టెక్నాలజీని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు వినియోగిస్తున్నాయని తెలిపారు. దీని ద్వారా పనులు సులభతరం, కచ్చితత్వంగా చేయడం జరుగుతుందని తెలిపారు. నూతన సాంకేతికతతో కాగితపు రహిత సేవలకు శ్రీకారం చుడుతున్నారని గుర్తు చేశారు. ఈ ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్మెంట్ ద్వారా కాగితం వియోగం ఘననీయంగా తగ్గుతుందని తెలిపారు. ఫలితంగా సమాజానికి, పర్యావరణానికి కొంత సహకారం అందించిన వాళ్లమవుతామని అన్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఎప్రిల్ 2025లో దీనిని పూర్తిగా అందుబాటులోకి తీసుకురాబోతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీఎం(ఈఅండ్ఎం) శ్రీనివాసులు, డీజీఎం(ఎఫ్జీడీ) మహేందర్, డీజీఎం(ఐటీ) మధుసూదన్‌రెడ్డి, డీజీఎం(సివిల్) అజుజుల్లాఖాన్, డీజీఎంలు వేణుగోపాల్, సంతోష్ కుమార్, జనగామ శ్రీనివాస్, పంతులా నాయక్, మెడికల్ సూపరింటెండెంట్ రవీందర్, ఎస్వోటూ జీఎం వెంకటయ్య,సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహహన్ సింగ్ పాల్గొన్నారు.

ప్రజా పంపిణీని పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్

ప్రజా పంపిణీని పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ డీలర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా పంపిణిపై పౌరసరఫరాల శాఖ అధికారులు, డీలర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పారదర్శకంగా ప్రజా పంపిణీ ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. లబ్దిదారులకు రేషన్ బియ్యం, నాణ్యమైన సరుకులు అందించాలని, రేషన్ షాప్ డీలర్లు సరుకులను సక్రమంగా లబ్దిదారులకు అందించడంలో పారదర్శకత పాటించాలన్నారు. జిల్లా నుంచి ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని గుర్తించడం జరిగిందని, బియ్యం అక్రమ రవాణా, రీసైక్లింగ్ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతినెల ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్దేశించిన సమయంలోగా పంపిణి ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. రేషన్ షాపులలో సరుకు నిల్వ, వివరాలకు సంబంధించిన రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే వారిపై కేసులు నమోదు చేయాలనీ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకల్యాణి, డీఎస్ఓ కిరణ్ కుమార్, డీఎం గోపాల్, అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలి

నిర్మల్‌రూరల్ : విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలని డీఈఓ రామారావు అన్నారు. గురువారం లక్ష్మణచాంద మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పది పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేశారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడిలకు లోను కాకుండా కష్టపడి చదివి, అందరూ ఉత్తీర్ణులై లక్ష్యం చేరే విధంగా మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

పెంబి : బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పవార్ రామారావు పాటిల్, జిల్లా అధ్యక్షులు రాథోడ్ రితేష్ హజరయ్యారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం దిశ నిర్దేశం చేశారు. ఇందులో అంకం మహేందర్, మండలాధ్యక్షులు వెంకటేష్, పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని హనుమంతుపల్లి గ్రామానికి చెందిన నస్పూరి గౌరయ్య(49) గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ పి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..గౌరయ్య ముంబైలో కూలి పని చేసుకొని బతికేవాడు. గత సంవత్సరం ముంబై నుండి వచ్చి కూతురు పెళ్లి చేసి ఇల్లు కట్టుకున్నాడు. వాటికోసం సుమారు రూ.5లక్షల వరకు అప్పు చేశాడు. అవి తీర్చడం భారమై ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వరద కాల్వలో లారీ బోల్తా

- డ్రైవర్‌కు గాయాలు



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని రాణాపూర్ గ్రామ సమీపంలోని ప్రాణహిత చేవెళ్ల స్వర్ణ వరద కాల్వలో లారీ అదుపు తప్పి బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలు అయినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీ 05 టీడీ 1023 నెంబర్ గల లారీ సిమెంట్ బస్తాల లోడ్‌తో గురువారం ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వస్తుండగా డ్రైవర్ ఇష్తికర్ నిర్లక్ష్యంగా నడపడంవల్ల రాణాపూర్ సమీపంలోని ప్రాణహిత చేవెళ్ల స్వర్ణ వరద కాల్వలో బోల్తా పడిందని ఎస్సై తెలిపారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని దొనబండ, సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష్, తెలుగు మీడియం స్కూళ్ల ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశాల్లో భాగంగా ఐఎఫ్‌సీ పానల్ బోర్డుల వినియోగంపై అవగహన కల్పించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జి.హన్మాండ్లు ఆధ్వర్యంలో కాంప్లెక్స్ లెవెల్లో శిక్షణ పొందిన ఆర్పీలతో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఆర్పీలు దుర్గాన, తిరుపతి, సత్తయ్య, మంచిర్యాల, మందమర్రి, హాజీపూర్, నస్పూర్, జైపూర్, భీమారం మండలాల ఇంగ్లీష్, తెలుగు మీడియం పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లకు ఐఎఫ్‌సీ పానల్ బోర్డులతో పాఠాలు ఎలా డౌన్లోడ్ చేయాలి, విద్యార్థులకు పానల్ బోర్డులతో ఎలా బోధించాలనే అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

ఎమ్మెల్యే, ఎంపీ చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-జైపూర్

పది రోజుల విరామం తర్వాత ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ చొరవతో పత్తి కొనుగోళ్లు పునఃప్రారంచడం జరిగిందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈ సంర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రైతుల ఇబ్బందుల పట్ల తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే, ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని షుర్ ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ కె.వినోద్ అన్నారు. గురువారం మండలంలోని పరిధిలో గిరిజన బాలిక రెసిడెన్షియల్, కేజీబీవీ పాఠశాల, కళాశాలలో షుర్ ఎన్జీఓ ఆధ్వర్యంలో ఫీల్డ్ సూపర్‌వైజర్ ఎన్. నారాయణతో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో బాల్య వివాహన నిర్మూలనకై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా షుర్ ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ కె.వినోద్ మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ, సంరక్షణ కోసం ఒక వ్యవస్థానే పని చేస్తుందన్నారు. వారికి కోసం ప్రత్యేకంగా జేజేబీ కోర్టు, చైల్డ్‌లైన్, ఐసీపీఎస్, ఎన్జీఓలు పనిచేస్తున్నామని తెలిపారు. ఆపదలో ఉన్నవారు ఎవరికి భయపడకుండా డయల్ 100, 181, 1098కి కాల్ చేయాలన్నారు. బాలిక హక్కుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. అలాగే ఎంత కష్టమచ్చిన చదువు మధ్యలో ఆపివేయవద్దని సూచించారు. ప్రిన్సిపాల్ రోజా రాణి, కేజీబీవీ ఎస్ఓ మల్లీశ్వరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ రాజార్షిషా పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో టీఎన్జీఓ యూనియన్ నూతన జిల్లా డైరీని జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో పాటు అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి ఆవిష్కరించారు. ఈ కలెక్టర్ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు సమిష్టిగా పని చేస్తూ, జిల్లాను ప్రగతి పథంలో ముందు ఉంచాలన్నారు. టీఎన్జీవోస్ డైరీ ఉద్యోగులకు ఉపయోగపడే విధంగా ఉందని కొనియాడారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు సంద అశోక్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా అభివృద్ధికి ఉద్యోగులు మరింత కృషి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లను సంఘం సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నవీన్ కుమార్, రాష్ట్ర నాయకులు తిరుమల్‌రెడ్డి, తాలూకా అధ్యక్ష కార్యదర్శులు మహేందర్, అరుణ్, వార్డెన్ సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింలు, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జాదవ్ నూర్‌సింగ్, మున్సిపల్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు వెంకటేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఉద్యోగుల సంఘం జిల్లా గోవింద్, జిల్లా బాధ్యులు గోపి, సుజాత, రాధ, చంద్ర మోహన్, రాజేశ్వర్, చంద్ర శేఖర్, అనిల్, కలీం, సంతోష్, దిరేశ్, ఒంప్రసాద్, సురేందర్ మహిళా ఉద్యోగులు ఆరతి, లక్ష్మి రజిత, ఆశాజ్యోతి వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 20 నుంచి మార్చి 30 వరకు అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి వైద్యురాలు ప్రియాంక తెలిపారు. గురువారం ఆస్పత్రిలో పలువురికి పరీక్షలు నిర్వహించారు. వైద్యురాలు ప్రియాంక మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులైన బీపీ, డయాబెటిస్, క్యాన్సర్ తదితర వ్యాధులను గుర్తించి, జిల్లా కేంద్రానికి నివేదికను పంపడం జరుగుతుందన్నారు.

ముధోల్‌లో అఖండ హరినామ సప్తహ



నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని పశుపతినాథ్ శివాలయం ఆలయంలో గురువారం ఉదయం అఖండ హరినామ సప్తహ కార్యక్రమం ప్రారంభమైంది. బాలాజీ గురుజీ, రాందాస్ గురుజీ నేతృత్వంలో ఈ సప్తాహ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా గ్రామస్తులు నిర్వహిస్తున్నారు. ఉదయం వేళలో వేకువ జామున కాగడరాతి కార్యక్రమాన్ని భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. ఈ సప్తాహ ఏడు రోజుల పాటు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

సేవలు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-నేరడిగొండ

చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలు వినియోగించుకోవాలని చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహ ముక్త్ భారత్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పొక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ పిల్లలు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని వారి హక్కులకు ఎటువంటి భంగం కలిగిన ఈ 1098 నెంబర్‌కి కాల్ చేసి వాటి సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. అదే విధంగా ప్రధాన మంత్రి ఇచ్చిన పిలుపుమేరకు భారతదేశాన్ని బాల్య వివాహ ముక్తభారత్‌గా మార్చాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ చిన్నపిల్లల పెండ్లిల వల్ల జరిగే అనర్థాల గురించి, పిల్లలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీపీయూ, ఎస్ఐ వినోద్, సోషల్ వర్కర్ రవికాంత్ అంగన్‌వాడీ టీచర్, పాఠశాల ఉపాధ్యాయులు జగదీశ్వర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని పెన్‌గంగా నుంచి ఆదిలాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను గురువారం భోరజ్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై వి.పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెన్‌గంగా నది ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు సీఐ డి.సాయినాథ్ ఆధ్వర్యంలో ఎస్సై వి.పురుషోత్తం, ఏఎస్సై ఆత్మారాం, పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించామని ఇందులో రెండు ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడ్డాయని అన్నారు. వాటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు తెలిపారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అక్రమ ఇసుక మాఫియాపై ఉక్కు పాదం మోపాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలని, తెలిపిన సూచనల మేరకు ఇసుక అక్రమ రవాణా జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.



రంజాన్ మాసంలో మౌలిక వసతులు కల్పించాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

మార్చి 2 నుంచి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమవుతున్న సందర్భంగా నిర్మల్ పట్టణంలో తాగునీరు, సానిటేషన్, వీధి లైట్లు, దోమల మందు, ఫాగింగ్, బ్లీచింగ్ మొదలగు మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ సయ్యద్ అర్జుమాండ్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైనారిటీ అజర్ హుస్సేన్, జిల్లా మైనార్టీ చైర్మెన్ జునెద్ మెమన్, నిర్మల్ పట్టణ మైనార్టీ అధ్యక్షులు ఎంఎ మాథీన్, మాజీ కౌన్సిలర్ ఇమ్రాన్ ఉల్లాహ్, ఎజాస్ హుస్సేన్, అల్తాఫ్ ఖిజార్ పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

విద్యార్థులు పట్టుదలతో చదవాలని హైమన్ డార్ఫ్-బెట్టి ఎలిజిబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షులు దుర్వ సంతోష్ అన్నారు. గురువారం మండలంలోని ముత్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో హైమన్ డార్ఫ్-బెట్టి ఎలిజిబెత్ స్మారక గ్రంథాలయం ఆధ్వర్యంలో 23 మంది పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్, పెన్, పెన్సిళ్లను ఉపాధ్యాయులతో కలిసి పంపిణి చేశారు. ఈ సందర్భంగా హైమన్ డార్ఫ్ బెట్టి ఎలిజిబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపకులు దుర్వ సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని, కష్టపడి చదవాలని పేర్కొన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పేదరికాన్ని నిర్మూలించడానికి చదువు ఒక వజ్రాయుధం లాంటిందని తెలిపారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదువాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, ఉపాధ్యాయులు గారులే కిరణ్, ఆదిమూలం నరేష్, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు అవగాహన



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గురువారం ఎంపీడీఓ శివకుమార్, హౌసింగ్ డీఈఈ దయానంద్‌లు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విధివిధానాల గురించి వారికి తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, త్వరలో పూర్తి వివరాలు తెలియజేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే లబ్దిదారులకు బేస్‌మెంట్ లెవల్, డోర్ లెవల్, స్లాబ్, ప్లాస్టింగ్ చేసిన తర్వాత నాలుగు విడతలుగా డబ్బులు విడుదల చేస్తారని తెలిపారు. వెంకటపూర్ గ్రామంలో 62 మంది ఇందిరమ్మ లబ్దిదారులున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రమ్యశ్రీ, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు, అధికారులు పాల్గొన్నారు.